# సింగిల్ పేజీ కథలు

## అతనికంటే ఘనుడు

'ఇక లాభం లేదు. ఊరుకుని ఉపయోగం లేదు. ఎంతకాలం ఇలా? మనిషికున్న నాలుగుదశల్లో ఒక్కోదశలో ఒక్కో అనుభవం! ఏ వయసుకు ఆ ముచ్చట అని పెద్దలు ఊరికే అన్నారా? పెద్దవాడు కదా అని నోరు మెదపకుండా వాడికి మర్యాద ఇస్తుంటే వాడు ఆ మర్యాదనే మైనా నిలుపుకున్నాడా? ప్రభుత్వశాఖలో ఇంజనీర్‌గా చేరి అయిదు సంవత్సరాలు అయిపోయింది. నా తర్వాత వాడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురం మూడేళ్ళ ఆరుచేతులా సంపాదిస్తున్నాం. కానీ ఏమిటి లాభం? ఒక అందం లేదు, ఆనందం లేదు. ఒక్కటే రొటీన్ లైఫ్!

వాడు డాక్టరైనంత మాత్రాన విరాగైపోవాలా? దేశంలో ఎంతమంది డాక్టర్లు లేరు? ఇక ఊరుకుని లాభం లేదు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సరితను పెళ్లి చేసుకొని తీసుకొచ్చేయాలి. అప్పుడైనా వాడికి సిగ్గొస్తుందేమో!'

ముప్పై అయిదేళ్లొచ్చినా పెళ్లి చేసుకోని అన్నగార్ని అలవాటుగా తిట్టుకున్నాడు శంకర్!

* * *

ఆరోజు అందరూ ఆశ్చర్యపోయారు.

"చక్కగా బుద్ధిగా వుండే శంకర్ ఎంత పని చేశాడు?"

"ఇదేం పనిరా, అన్నయ్య పెళ్లి చేసుకోకుండా నువ్వు చేసుకోవడం ఏమిటి? చదువుకున్నావ్, ఎందుకు?" అని ఇంకా...పరువు, ప్రతిష్ఠ, సంఘం, సమాజం, ఇంగిత జ్ఞానం...ఇలాంటివాటి గురించి అరగంటసేపు అరచి అలసిపోయారు తల్లిదండ్రులు.

అన్నీ విని ఒక బారెడు నిట్టూర్పు విడిచి "ఉండమంటే ఇంట్లో ఉంటాను. పొమ్మంటే బయటికి పోతాను సరితతో. ఏం చెయ్యమంటారో చెప్పండి" అన్నాడు శంకర్.

తల్లిదండ్రులు, అన్నగారు ఏమీ మాట్లాడకపోవడంతో మౌనం సంపూర్ణాంగీకారం అనుకొని చక్కగా ఇంట్లోకి వెళ్లిపోయాడు శంకర్ సతీమణి సరితతో.

* * *

తమ్ముడ్ని, మరదల్ని, వాళ్ల సరదాల్ని, సంతోషాన్ని చూసి అదోలా ఫీలయ్యేవాడు ఆనంద్. వాళ్లిద్దరూ కలసి సినిమాకు బండిమీద వెళ్తుంటే ఏదోలా వుండేది ఆనంద్‌కి.

ఆనంద్ ప్రక్క గదిలోనే తమ్ముడు, మరదలి బెడ్రూం.



రాత్రుళ్లు వాళ్ల నవ్వులు, వినపించీ వినపించనట్టుండే మాటలు ఆనంద్ యవ్వనాన్ని పురికొల్పాయి.

అలస్యం చేయకుండా ఆనంద్ కూడా పెళ్లి చేసుకుంటానన్నాడు నెమ్మదిగా.

అతనిలో వచ్చిన మార్పుకు ఇంట్లోవాళ్లందరూ ఆశ్చర్యపోయి తెగ ఆనందపడిపోయారు. అర్జంటుగా ఓ అమ్మాయిని చూసి ఆ నెల్లోనే ఆనంద్ పెళ్లి నిశ్చయించేశారు.

ఆనంద్ పెళ్లిరోజు వచ్చేసింది.

రాత్రి ముహూర్తం. మధ్యాహ్నం భోజనాలు చేసి బంధువులందరూ పందిట్లో కూర్చున్నారు. స్నేహితులతో సరదాగా మాట్లాడుతూ పందిట్లో ఒకచోట కూర్చున్నాడు ఆనంద్. శంకర్, తల్లిదండ్రులు పెళ్లి పనుల్లో హడావుడిగా వున్నారు.

అంతలో కొరియర్ అతను వచ్చి ఓ కవర్ అందించాడు ఆనంద్‌కి. అది అతని పేరనే వచ్చింది. ఆనంద్ గబగబా విప్పి చదవటం మొదలెట్టాడు.

"ఆనంద్ అన్నయ్యా, కంగ్రాట్యులేషన్స్!

శంకర్ అన్నయ్య తన పెళ్లి గురించి లెటర్ రాశాడు. ఇక్కడ చాలా బిజీగా వుండడం వల్ల జవాబు రాయలేకపోయాను. శంకర్‌ని ఏమీ అనుకోవద్దని చెప్పు.

నేను నీ పెళ్లికి కూడా రాలేకపోతున్నందుకు చాలా విచారిస్తున్నాను. కారణం ఏమిటంటే మృదులను ఆసుపత్రిలో జాయిన్ చేశాను. డెలివరీ టైం వచ్చేసింది. సారీ! అన్నట్టు నీకు మృదుల అంటే తెలియదు కదూ!? మృదుల, నేను ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నాం సంవత్సరంన్నర క్రితం. మీరేమంటారోనని భయం వేసి ఇంతవరకూ ఈ విషయాన్ని తెలియబరచలేదు. డెలివరీ అయిపోయాక మీరందరూ నన్ను మృదులతో రమ్మనమని వ్రాస్తే వస్తాము.

నాన్నగారు, అమ్మను, శంకర్ అన్నయ్యను, సరిత వదినను అడిగినట్టు చెప్పు. విష్ యు హ్యాపీ మేరీడ్ లైఫ్!- రమేష్.

ఉత్తరం చదవడం పూర్తిచేసి అలాగే వుండిపోయాడు ఆనంద్.

"ఎక్కడ్నుంచి వచ్చిందిరా ఉత్తరం?"

అప్పుడే వచ్చి అడుగుతున్న తండ్రికి సమాధానంగా...బెంగుళూరులో వుంటున్న తన రెండో తమ్ముడు రమేష్ రాసిన ఆ ఉత్తరాన్ని అందించాడు ఆనంద్.

**-ఎన్.బి.రామారావు**

## ఫలితం

శాంతికి మనసంతా పాడయింది. అత్తగారు అన్న మాటలు ఈటెల్లా తగులుతున్నాయి. ఎంత ఆలోచించినా తన తప్పేమిటో అర్థం కాలేదు. పెళ్లి చూపుల్లో "అమ్మాయి కుందనపు బొమ్మలా వుంది. డిగ్రీ చదివి, డిస్టింక్షన్‌లో పాసయ్యింది. సంగీతం, కుట్లు, అల్లికలు లాంటి అన్నింటిలో మంచి ప్రవేశం వుంది. పెళ్లి ఘనంగా చేయండి. కట్నం కూడా వద్దు" అన్న ఆవిడేనా ఈరోజు అంత మాటలు అన్నది. నాన్నగారు చెప్పినట్టుగానే భర్త చంద్రశేఖర్ కూడా తనని సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేర్ అవమని, ఏ చిన్నా చితక పనిలో చేరినా, పరీక్షల మీద ఏకాగ్రత కుదరదని ఉద్యోగంలో కూడా చేరనివ్వలేదు. నిన్న మొన్న వచ్చిన తన తోటికోడలు టీచరుగా ఉద్యోగంలో చేరి, అప్పుడే రెండునెలల జీతం కూడా అందుకుంది. మొదటిసారి పరీక్షలో మంచి మార్కులు రాకపోవడంతో మెయిన్స్‌కి అర్హత పొందలేకపోయింది. ఈసారి తప్పనిసరిగా మెయిన్స్‌లో సెలక్ట్ అయి శాంతి అంటే ఏమిటో

వీళ్లందరికీ చెప్పాలి. అమ్మ లాంటి అత్తగారు అనుకున్న ఆవిడే తనని అందరిముందూ ఎంతెంత మాటలంది.

"మా అమ్మాయి బంగారం. చదువులో సరస్వతి. మంచి ఉద్యోగంలో చేరిపోయి మీ ఇంటి గౌరవాన్ని కాపాడుతుంది" అంటూ పెళ్లి చూపుల్లో ఊదరగొట్టి పెళ్లి కుదుర్చుకుంటారు. తీరా ఇక్కడికి వచ్చాక చదువు వెనకపడుతుంది. పక్కింటికో ఎదురింటికో రమ్మంటే చదువు జ్ఞాపకం వస్తుంది. తీరా మార్కులు రాకపోతే పని ఒత్తిడి వల్ల అని దాటేస్తారు. ఎంత మంచిగా చూసినా అత్తగారిల్లు అమ్మగారిల్లు కాలేదు. అత్త కన్నతల్లి కాలేదు" అన్న అత్తయ్య మాటలకి తనెంత సిగ్గుతో చితికిపోయింది.

పేపర్స్‌లో రిజల్ట్స్ ప్రకటించారు. శాంతికి డిప్యూటీ కలెక్టర్ పోస్టింగ్ వచ్చింది. ఇప్పుడు ఈవిడకి బుద్ధి చెప్పాలి. తనంటే ఏమిటో చూపించాలి అని ఇంటిలో ప్రవేశించబోయిన శాంతికి తన పేరు అత్తగారి నోట వినబడటంతో టక్కున ఆగిపోయింది, గుమ్మం బయటనే. ఆవిడ మావయ్యగారితో అంటోంది. "ఏమండీ చూశారా! మన శాంతి ఎంత గౌరవం సంపాదించిపెట్టిందో. మంచి భర్త, అన్నీ వున్న సంసారంతో ఆడవాళ్లకి కర్తవ్యం వెనుకపడి, బాధ్యతలు మర్చిపోతారు. తను ఎంత తెలివైనదో, ఎంత సాధించగలదో నాకు తెలుసు. అందుకే బుజ్జగించి చూశాను. మొదటి సంవత్సరం సాధించలేకపోయింది. అత్తగారి సాధింపు మొదలుపెట్టాను. తను కర్తవ్యం సాధించి అటు భర్తకి, ఇటు మనకి, పుట్టింటికి గౌరవాన్ని తెచ్చింది" అన్న మాటలు విని నిశ్చేష్టురాలినయ్యాను. అత్తలో అమ్మను చూసి, గబగబా వెళ్లి అత్తయ్య, మామయ్యలకు మంచి బట్టలు, ఇంటిల్లిపాదికీ స్వీట్సుతో ఇంట్లో అడుగుపెట్టాను. ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది. అత్తగారిల్లే స్వర్గంలా అనిపించింది.

**-బి.ఆశాలత (సికింద్రాబాద్)**


# పరిష్కారం

"రాధికా! నిన్ను చాలాసేపటినుంచి గమనిస్తున్నాను. ఇప్పటివరకూ బాగానే వున్నావు. ఫ్రెండ్స్‌తో సరదాగా మాట్లాడుతున్నావు. శ్రావణి వచ్చి మిమ్మల్ని పలకరించగానే నువ్వు మాత్రం ముభావంగా మారిపోయావు. నువ్వు, శ్రావణి మాట్లాడుకోరా ఏమిటి?" నా ప్రక్కనున్న చైర్‌లో వచ్చి కూర్చున్న రాధికనడిగాను. అదీగాక రాధిక నా స్వంత చెల్లెలి కూతురు కూడా.

"శ్రావణి నాతో స్నేహంగానే మాట్లాడుతుంది అంకుల్. దాన్ని చూస్తే అకారణంగానే నాకు కోపం వస్తుంది. తనంటే నాకిష్టం వుండదు. నాకు ఎందుకలా అనిపిస్తుందో అర్థం కావడం లేదు. ఓసారి నేను సైకాలజిస్ట్‌ని సంప్రదించాలనుకుంటున్నాను. ఒక్క శ్రావణి విషయంలో మాత్రమే నా ప్రవర్తన అలా వుంటుంది. ఎప్పుడైనా నా ఫ్రెండ్స్ శ్రావణి గురించి మాట్లాడుకుంటూంటే కోపంతో వాళ్లనేమైనా చేస్తానేమోనని భయంగా వుంటుంది అంకుల్" అంది రాధిక తన సమస్యని వివరిస్తూ.

"చూడమ్మా రాధికా! నీ సమస్యకి పరిష్కారం సైకాలజిస్ట్ మాత్రమే ఇస్తాడనుకోకు. చిన్నప్పటినుండి నీగురించి తెలిసినవాళ్లెవరైనా నీ సమస్యకు కారణమేమిటో తేలిగ్గా చెప్పగలరు. ఒక్కగానొక్క అమ్మాయివి కావడంతో చిన్నప్పటినుండి నువ్వు అతి గారాభంగా పెరిగావు. నువ్వు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. నలుగురూ నీగురించి గొప్పగా చెప్పుకోవాలని, అందరూ నీకు కాంప్లిమెంట్స్ ఇవ్వాలని నీ ఆశ, ఆరాటం. దీనికితోడు నువ్వు బాగా అందంగా కూడా వుండడంతో నీకు గర్వం కూడా ఎక్కువే. ప్రతిదానికి నీమాటే నెగ్గాలని పంతం నీకు. బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టు డబ్బున్న నీ చుట్టూ ఫ్రెండ్స్‌మనే వంకతో చాలామంది చేరి నీ భావాలకు వంతపాడుతూ నీలో అహంకారాన్ని మరింత పెంచారు.

శ్రావణి మీ కాలేజ్‌లో, మీ క్లాస్‌లో జాయినయ్యేవరకూ ఒకవిధంగా నీమాటే చెల్లింది. శ్రావణి కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవడం మొదలుపెట్టింది. ఇదే మొదలు నీకు శ్రావణి మీద కోపం అనే బీజం పడడం. తరచుగా ఆ అమ్మాయి అనాథ శరణాలయానికి వెళ్లి తనకి చేతనైనంతలో అనాథ పిల్లలకి ఆర్థిక సహాయం చేయడం, వాళ్లకి పుస్తకాలు, బట్టలు అంది



వ్వడం, అంతేగాక సాహిత్యపరంగా కూడా మంచి పేరు తెచ్చుకోవడం ఇవన్నీ ఆమెపై నీకు గల కోపానికి కొంత కారణం. ఇవేగాక శ్రావణి కుటుంబం మీ ఇంటి పక్కనే అద్దెకి దిగడం, మీ ఇంట్లోవాళ్లంతా ఆమెని మెచ్చుకోవడం, ఎంత ఎదిగినా ఎవరి పొగడ్తలకు పొంగిపోక ఒదిగి వినయంగా వుండే శ్రావణి మనస్తత్వం అంటే నీకు కోపం. ఏ విషయంలోనూ నీకు సరితూగని శ్రావణిని అందరూ మెచ్చుకుంటారు కనుక ఆమె అంటే నీకు కోపం. రాధికా! అసలు నువ్వు శ్రావణిపై పెంచుకున్న భావం పేరు కోపం కాదు, ఈర్ష్య, అసూయ!" చెప్పడం ఆపి రాధిక వైపు చూశాను. నేను చెప్పేది శ్రద్ధగా వింటోంది రాధిక. తన ముఖంలో నేను చెప్పే విషయాల పట్ల కొద్దిగా అపనమ్మకం కనిపిస్తోంది.

నేను చెప్పేవన్నీ చేదునిజాలుగా రాధిక అనుకోవడం సహజమే మరి. నేను చెప్పిన విషయాలు జీర్ణించుకోవడానికి అన్నట్లు కాసేపు మౌనంగా వుండిపోయింది రాధిక. కాసేపటి తర్వాత "అవునంకుల్! ఆలోచిస్తే మీరు చెప్పినవన్నీ నిజాలే అనిపిస్తున్నాయి. మరి దీనికి పరిష్కారం ఏమిటి?" అంది రాధిక.

"రాధికా! ఒకవిధంగా నీ ఆలోచనలు, శ్రావణి భావాలు ఒకటే. శ్రావణి ఏ విషయాల్లో అయితే గుర్తింపు తెచ్చుకుందో అలాంటి విషయాలంటే నీకూ చాలా ఇష్టం. కానీ నువ్వు నీ ఇష్టాలను నెరవేర్చుకోవాలని ఏ ప్రయత్నం చెయ్యవు. ఊరికే పేరు రావాలని నీ కోరిక. కానీ శ్రావణి చాలా కష్టమైనాసరే తగిన కృషి చేసి శ్రమపడి ఫలితం అందుకుంటుంది. అందుకే శ్రావణికి అంత గుర్తింపు. నువ్వు కూడా ఆమె బాటలో నడవాలి. స్నేహానికి మంచి విలువనిచ్చే శ్రావణితో స్నేహం చేయడానికి ప్రయత్నించు. మంచివారితో స్నేహం మన వ్యక్తిత్వాన్ని పెంచుతుంది. ఒక్కసారి నువ్వు శ్రావణితో మాట్లాడితే ఆమెపట్ల నీలో వున్న అసూయ, ద్వేషం అన్నీ కరిగిపోతాయి. ఏమంటావు?" అన్నాను రాధికతో.

నా ప్రశ్నకు సమాధానం అటుగా వచ్చిన శ్రావణిని స్వయంగా పిలిచి సరదాగా మాట్లాడసాగింది రాధిక. నా సలహా పాటిస్తున్నందుకు రాధికను కళ్లతోనే అభినందించాను ఆనందంగా.

**-యస్.కృష్ణకుమారి**
**(కొత్తవేమవరం)**